సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 21 । జూలై । 2023



నేటి నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే

జిల్లా వ్యాప్తంగా బూత్ స్థాయిలో ఇంటింటా ఓటర్ల సర్వే శుక్రవారం నుంచి చేపడుతున్నామని జేసీ జే.శివశ్రీనివాస్ తెలిపారు. 8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

నెల్లిపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. 8లో



ఆస్పత్రిని సందర్శించిన ఏడీఎంహెచ్‌వో 8లో

వై.రామవరం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని ఏడీఎంహెచ్‌వో భాస్కర్ సందర్శించారు.

న్యూస్‌రీల్

శభాష్.. వలంటీర్

- డోలీలో గర్భిణి తరలింపు
- పది కిలోమీటర్లు మోసిన దేముడు



గర్భిణిని డోలీలో మోసుకు వస్తున్న గ్రామ వలంటీర్ దేముడు (వెనుక వ్యక్తి)

అనంతగిరి : పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని తరలించడంలో వలంటీర్ బాసటగా నిలిచాడు. ఆమె భర్తతోపాటు అతను కూడా డోలీ మోసి ప్రాణాపాయం నుంచి కాపాడాడు. వివరాలిలాఉన్నాయి. మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగుడకు చెందిన గర్భిణి బడ్నాయిన బుగ్గమ్మ (19)కు గురువారం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో గర్భిణి భర్త శ్రీను, గ్రామ వలంటీర్ బడ్నాయిన దేముడు ఆమెను డోలీలో దట్టమైన అటవీ ప్రాంతం గుండా సుమారు పది కిలోమీటర్ల మేర మోసుకుంటూ నిమ్మటూట తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆటోలో గర్భిణిని కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. గర్భిణిని తరలించడంలో కీలకపాత్ర పోషించిన వలంటీర్ దేముడును పలువురు అభినందించారు.

ఐవీసీలో ప్రవేశాలకు 24న స్పాట్ అడ్మిషన్లు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్‌లో ఐవీసీలో లెటరల్/ఎంట్రీ ఇన్ డిప్లమో సెకండ్ ఈయర్-2023కు సంబంధించి ఈనెల 24న విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్‌లో 6, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 6, మెకానికల్‌లో 6 సీట్లు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈనెల 23వతేదీ వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకుని పాడేరు పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు పొందాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు మాత్రం విశాఖపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఈనెల24వ తేదీ ఉదయం హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు చదరంగం పోటీలు

- ఘనంగా అంతర్జాతీయ చెస్ దినోత్సవం



చెస్ పోటీల్లో నిమగ్నమైన విద్యార్థులు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ చెస్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ డిగ్రీ విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చెస్‌లో రాణిస్తే వారిలో మేధాశక్తి పెరుగుతుందన్నారు. చదరంగం ద్వారా ఆటగాడికి సృజనాత్మకత, ఏకాగ్రత, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మలత, క్రీడా విభాగం ఇన్‌చార్జి నాగబాబు, పీడీ ఎస్.అప్పారావు, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'మన జాతీయ జెండా కోసం' ప్రోమో విడుదల



ప్రోమోను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

సాక్షి,పాడేరు: 'మన జాతీయ జెండా కోసం' పేరిట రూపొందించిన ప్రోమోను పాడేరులోని తన నివాస గృహంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం ఉదయం ఆవిష్కరించారు. పాటలు రాసి వీడియోను రూపొందించిన హుకుంపేట మండలం గూడ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు ఓలెసు కృపానందాన్ని ఆయన అభినందించారు. గిరిజన యువతీ యువకులు వివిధ రంగాలపై తమకున్న కళాత్మకతను చాటుకోవడం మంచి పరిణామమన్నారు. కళాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్,యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్,అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యాంసుందర్‌రావు, సుండ్రుపుట్టు సచివాలయ కార్యదర్శి ఓలెసు దివాకరబాబు, ఎంఎల్‌వో శివ తదితరులు పాల్గొన్నారు.

విలీన మండలాల్లో.. ముంపు గుబులు

గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో విలీన ప్రాంతాలైన చింతూరు, ఎటపాక, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో ముంపు గుబులు నెలకొంది. ఇప్పటికే అప్రమత్తమైన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపునకు చర్యలు చేపట్టారు.

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- సహాయక చర్యలు ముమ్మరం
- రహదారులపైకి వరదనీరు
- 60 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



తాలిపేరు ప్రాజెక్టు నుంచి గోదావరి నదిలో వదులుతున్న వరదనీరు

చింతూరు: పెరుగుతున్న గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు విలీన మండలాల్లో గుబులు రేపుతున్నాయి. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేసింది. పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు గుర్తించిన హాస్టల్ భవనాలకు సంబంధించి విద్యార్థులకు సెలవులు ప్రకటించారు.

- హైరిస్క్ గర్భిణులు, ఇతర అత్యవసర రోగులను వరుసగా రెండోరోజు కూడా చింతూరు ఏరియా ఆస్పత్రి, తులసిపాక పీహెచ్‌సీలకు తరలించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ముందుగానే బియ్యం , కందిపప్పు పంపిణీ చేశారు.
- నిత్యావసరాల పంపిణీ నిమిత్తం చింతూరు, కూనవరం మండలం కోతులగుట్ట, గురుకుల పాఠశాల, వీఆర్‌పురం మండలం రేఖపల్లిలో 75 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 21 వేల కందిపప్పును నిల్వ చేశారు. సహాయక చర్యల్లో భాగంగా లాంచీలు, మరపడవలకు డీజిల్‌ను సమకూర్చారు. పీహెచ్‌సీల్లో జనరేటర్లకు కూడా డీజిల్‌ను సిద్ధం చేశారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లో ముంపు ప్రాంతాలను గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. వరద పెరుగుతున్న దృష్ట్యా క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

- చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో వైద్యులతో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సమావేశం నిర్వహించారు. వరద ప్రాంతాల్లో ముమ్మరంగా వైద్యసేవలు అందించాలని, మందులు అందుబాటులో ఉంచాలని మలేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.
- ముంపు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది పనితీరును జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని ఆయన ఆదేశించారు.

కూనవరం: వరద పెరుగుతున్నందున అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మాని అనంతలక్ష్మి, సచివాలయ కన్వీనర్ ఆవుల మరియాదాసు, నాయకులు కొమ్మాని సునీత, వీర్రాజులు కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలను ప్రస్తావించారు. కోతులగుట్టలోని గురుకుల పాఠశాల, కస్తూరిబా పాఠశాల, సచివాలయంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, మందులు, నిత్యావసరాలు, విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉంచాలని విన్నవించారు. కోతులగుట్ట నుంచి బోదునూరు మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసారు. వరద పెరుగుతున్నందున తహసీల్దార్ అనసూయ కూనవరంలోని ఉదయ్‌భాస్కర్ కాలనీకి చెందిన 30 కుటుంబాలను ఖాళీ చేయించి కోతులగుట్టలోని పునరావాస కేంద్రానికి తరలించారు.

ఎటపాక: భద్రాచలం వద్ద గురువారం ఉదయం 38 అడుగులకు చేరిన వరద క్రమేపీ పెరిగి మధ్యాహ్నం 3గంటలు దాటిన తరువాత 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేశారు.

- గోదావరికి ఎగువన ఉన్న చర్ల తాలిపేరు ప్రాజెక్టు నుంచి గురువారం సాయంత్రం 24 గేట్లు పూర్తిగా ఎత్తి 1,02,399 క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలో విడుదల చేస్తున్నారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- మండలంలోని నెల్లిపాక, గుండాల, నందిగామ, మురుమూరు ప్రాంతాల్లో తహసీల్దార్ వేణుగోపాల్ పరిస్థితిని సమీక్షించారు. గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు.పినపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు.
- నెల్లిపాక ఎంపీటీసీ అంజలి గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉన్న జాలర్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పశువులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని రైతులకు సూచించారు.జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి వరద ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు బాసటగా నిలుస్తున్నారు.

ముందు జాగ్రత్తగా గర్భిణుల తరలింపు

గౌరిదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో రహదారి సౌకర్యం లేని, వరద ముంపునకు గురికానున్న గ్రామాల నుంచి 26 మంది గర్భిణులను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతం నల్లకుంట ఆశ్రమ పాఠశాలకు తరలించారు. మండలంలోని 13 రేషన్ షాపుల పరిధిలోని కుటుంబాలకు ఆగస్టు నెల రేషన్ బియ్యాన్ని ముందుగానే పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు.

పోశమ్మ ఆలయాన్ని ముంచెత్తిన గోదావరి

దేవీపట్నం: గోదావరి వరద తాకిడికి గండిపోశమ్మ ఆలయం నీటమునిగింది. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ నిర్మాణంతో బ్యాక్ వాటర్ కారణంగా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం గోపురం మాత్రమే మినహాయించి మిగిలిన ఆలయం మొత్తం నీటమునిగింది.

సీలేరు కాంప్లెక్స్‌లో పెరుగుతున్న నీటిమట్టాలు

సీలేరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సీలేరు విద్యుత్ కాంప్లెక్సులోని జలవిద్యుత్ కేంద్రాలకు ఊరటనిస్తున్నాయి. ఏజెన్సీ సరిహద్దు ప్రాంతాల్లో గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రిజర్వాయర్లలో నీటిమట్టాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఉపనదుల ద్వారా నీరు చేరుతుండటంతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని అన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగినట్టు జెన్‌కో అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి 8 గంటల సమయానికి జెన్‌కో అధికారులు నీటిమట్టాల వివరాలను నమోదు చేశారు. సీలేరు కాంప్లెక్సులో బలిమెల, సీలేరు స్టోరేజీ ట్యాంకుల్లో 7.88 టీఎంసీలు నీరు చేరిందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం సీలేరులో 6 వేల క్యూసెక్కులు, బలిమెలకు 33.500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని వారు వివరించారు. ఒక్క బలిమెల జలాశయంలో 6 టీఎంసీల నీరు చేరిందని జెన్‌కో అధికారులు పేర్కొన్నారు.

చింతూరు: గోదావరి, శబరి నదుల వరద కారణంగా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో పలు రహదారులపైకి వరదనీరు చేరింది. శబరినది ఉధృతికి చింతూరు మండలంలో కుయిగూరువాగు పొంగి వరదనీరు జాతీయ రహదారి-326 పైనుంచి ప్రవహిస్తోంది. దీంతో ఆంధ్రా, ఒడిశా నడుమ గురువారం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతోపాటు అదే రహదారిలోని మరో నాలుగు గ్రామాలకు కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విలీన మండలాల్లో సుమారు 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

- చింతూరు మండలంలో సోకిలేరు, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటివాగులు పొంగి వరదనీరు రహదారులపైకి వచ్చేసింది. దీంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, చింతూరు మండలంలోని 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- కూనవరం మండలంలో కొండ్రాజుపేట, టేకులబోరు నడుమ కాజ్‌వేపైకి వరదనీరు చేరడంతో ఏడు గ్రామాలకు, ఎటపాక మండలంలో నెల్లిపాక, వీరాయిగూడెం నడుమ రహదారిపై వరదనీరు రావడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- వీఆర్‌పురం మండలంలో కన్నాయిగూడెం, ఇప్పూరు, అన్నవరం, సీతంపేట వద్ద గోదావరి వరదనీరు రహదారులపైకి చేరడంతో సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పునరావాస కేంద్రాలకు తరలింపు

వీఆర్‌పురం: పెరుగుతున్న గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు పరివాహక ప్రాంతాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గోదావరికి వరదనీరు పోటెత్తడంతోపాటు శబరి నదిలో కూడా స్వల్పంగా బ్యాక్ వాటర్ చేరుతోంది.

- వడ్డిగూడెం -వడ్డిగూడెం కాలనీల మధ్య వరద నీరు రహదారిపైకి చేరింది. కన్నాయిగూడెం-చింతరేవుపల్లి, ఏటిగూడెం- తుష్టివారిగూడెం, సీతంపేట-శ్రీరామగిరి, పోచవరం-ఇప్పూరు గ్రామాల మధ్య రహదారిపై వరదనీరు పోటెత్తడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ ఎన్.శ్రీధర్, ఎంపీడీవో రత్నకుమారి, ఎస్ఐ తెల్లం దుర్గాప్రసాద్ మండలంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.



సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్న వడ్డిగూడెం ప్రజలు

వడ్డిగూడెం, వడ్డిగుడెం కాలనీ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామని వారు పేర్కొన్నారు.

వరదలపై ఎలాంటి ఆందోళన వద్దు

- తహసీల్దార్లకు తక్షణ అవసరాలకు రూ.10 లక్షల నిధులు
- 92 గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రులకు తరలింపు
- 12 లాంచీలు, పడవలు సిద్ధం
- పునరావాస కేంద్రాల వద్ద మూడు బోర్లు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



కూనవరంలో కలెక్టర్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుజ్జా విజయ తదితరులు

చింతూరు: విలీన మండలాల ప్రజలు వరదలపై ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ పరంగా అన్ని సహాయక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన చింతూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం గోదావరి, శబరి నదుల్లో 10 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉందన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహాయక చర్యల నిమిత్తం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేశామని, తక్షణ అవసరాల నిమిత్తం రూ.10 లక్షలు తహసీల్దార్లకు అందచేసినట్లు ఆయన పేర్కొన్నారు. గర్భిణులు 92 మందిని ముందస్తుగా ఆస్పత్రులకు తరలించామని, 12 లాంచీలు, పడవలను ఉంచామని ఆయన వెల్లడించారు. సమాచార వ్యవస్థ కోసం సెల్‌టవర్లు నిరంతరం పనిచేసేలా చర్యలు చేపట్టామని, తాగునీటి కోసం పునరావాస కేంద్రాల వద్ద అత్యవసరంగా మూడు చేతిబోర్లను వేయిస్తున్నామని పేర్కొన్నారు. లక్ష వాటర్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచామన్నారు. సహాయక చర్యల పర్యవేక్షణ నిమిత్తం మండలానికి ఒకరు చొప్పున ఓ ఉన్నతాధికారిని నియమించామన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు.



వరదల నేపథ్యంలో ఆగస్టు రేషన్ బియ్యం ముందుగానే పంపిణీ చేస్తున్న సిబ్బంది



చింతూరు మండలంలో వరద నీటిలో రహదారి దాటుతున్న ప్రజలు



పునరావాసం నిమిత్తం హాస్టళ్లకు సెలవు ప్రకటించడంతో ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు



చింతూరు, వీఆర్‌పురం మండలాల రహదారిపై నిలిచిపోయిన సోకిలేరు వాగు వరదనీరు



అన్నవరం సప్టాపై నుంచి పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం

ఎస్పీ తుహిన్ సిన్హా

సీలేరు: గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గంజాయి పెంపకం, రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయికి బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని గిరి రైతులను కోరారు. ఈ ఏడాది కూడా పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామని తెలిపారు. గతేడాది జిల్లాలో గంజాయి తోటలను స్వచ్ఛందంగా ధ్వంసం చేసిన రైతులకు ప్రత్యామ్నాయ ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 7500 హెక్టార్లలో వివిధ వాణిజ్య పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

అదుపులో మావోయిస్టుల కదలికలు

ప్రస్తుతం జిల్లాలో మావోయిస్టుల కదలికలు అదుపులోనే ఉన్నాయని, గిరిజన గ్రామాలు అభివృద్ధి కోరుకోవం వల్లే మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టిందని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. వారి కదలికలు తగ్గినప్పటికీ పొరుగు రాష్ట్రాల నుంచి వస్తారన్న సమాచారం మేరకు పూర్తి స్థాయిలో నిఘా ఉంచామన్నారు. ఇందుకు అనుగుణంగా గిరిజనుల్లో మార్పు తీసుకొస్తున్నామని, గిరిజన గ్రామాల అభివృద్ధికి ఫ్రెండ్లీ పోలీసు, పేరణి, వంటి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఒడిశా గంజాయి అడ్డుకట్టకు ప్రణాళిక

గిరిజనుల కోసం బోర్లు, రహదారుల నిర్మాణం, సెల్ టవర్లను నిర్మిస్తూ గిరిజనులకు సౌకర్యాల కల్పనలో పోలీసుశాఖ భాగస్వామ్యం అవుతుందని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. దీనిలో భాగంగా మారుమూల ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. జిల్లాలో కొత్తగా 12 పోలీసుస్టేషన్ల నిర్మాణం జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పట్టుబడుతున్న గంజాయి అంతా ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచే మన ప్రాంతానికి వస్తోందన్నారు. ప్రత్యేక ప్రణాళికతో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో చింతపల్లి ఏఎస్పీ ప్రశాంతశిశికిషోర్, సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

చింతపల్లి రూరల్: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఏఈ అప్పారావు తెలిపారు. రెండు మండలాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం వాటి పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై కొరడా

ఇద్దరిని ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ఎస్‌జీటీ ఉపాధ్యాయులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ కఠిన చర్యలు చేపట్టారు. పెదబయలు మండలంలోని సంపంగిపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న కోనాడ విజయలక్ష్మి, రొంగలి శంకరరావులను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఆయన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంపంగిపుట్టు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్నిఆయన కలెక్టర్,డీఈవోల దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో ఉపాధ్యాయుల పనితీరుపై సమగ్ర విచారణకు డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారి ఇద్దరు ఎస్‌జీటీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. డీఈవో సమగ్ర విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించారు. ఉపాధ్యాయుల విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని తప్పుబట్టిన కలెక్టర్‌కు వారిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇద్దరు ఎస్‌జీటీలు పాఠశాలకు వెళ్లకుండా, ఓ వలంటీర్ ఏర్పాటు చేసుకుని పాఠశాల నడుపుతున్నారని విచారణలో గుర్తించారు. నాడు-నేడు పాఠశాలల పనులు సక్రమంగా జరగలేదని, పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించడంలోను వారు విఫలమయ్యారని రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి పంపిన లేఖలో కలెక్టర్ పేర్కొన్నారు. సంపంగిపుట్టు పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు.

చర్చనీయాంశంగా ఒడిశా బోర్డుల ఏర్పాటు



జోలాపుట్టులో ఆంధ్ర ప్రాంతంలో ఒడిశా అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని ఆంధ్ర భూ భాగంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన స్వాగతం తెలిపే బోర్డులు ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆంధ్ర భూ భాగంలోని ఎల్ఎఫ్ ప్రదేశంలో ఒడిశా అధికారులు ఒడిశాలోని బిల్లాపుట్టు గ్రామ పంచాయితీకి స్వాగతం పలికే బోర్డులు ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటుచేయడం నిబంధనలకు విరుద్ధమని జోలాపుట్టు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

1.23 లక్షల మందికి ధ్రువపత్రాలు

- 11 రకాల పంపిణీ
- 2.44 లక్షల ఇళ్లను సందర్శించిన వలంటీర్లు
- 20 రోజుల్లో 251 జగనన్న సురక్ష కార్యక్రమాలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ, ఇతర నేతలు

కొయ్యూరు: జగనన్న సురక్షలో జిల్లాలో 20 రోజుల్లో 1.23 లక్షల మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం అందజేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. గురువారం ఆమె కొమ్మికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్షకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. జిల్లాలో 2.44 లక్షల ఇళ్లను వలంటీర్లు సందర్శించి 1.86 లక్షల టోకెన్లను జారీ చేయగా వీరిలో 1.23 మందికి ధ్రువపత్రాలు ఇచ్చారన్నారు. 20 రోజుల్లో 251 జగనన్న సురక్ష సమావేశాలు నిర్వహించామని తెలిపారు. స్వీకరించిన వినతుల్లో చాలావరకు పరిష్కారమయ్యాయని ఆమె పేర్కొన్నారు. దీంతోపాటు గతేడాది నుంచి నిర్వహిస్తున్న గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిష్కరించినట్టు ఆమె పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ మూలంగానే ఇది సాధ్యమైందన్నారు. ఇలాంటి వ్యవస్థను రూపకల్పన చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు టీడీపీ హయాంలో జరగలేదన్నారు. జన్మభూమి కమిటీలు అందినంత వరకు దోచుకున్నాయని విమర్శించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


సునీల్ (ఫైల్)


నాని (ఫైల్)

గంగవరం : నెల్లిపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారని ఎస్‌ఐ చినబాబు విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లిపూడి నుంచి కొత్తపల్లి వైపు ద్విచక్రవాహనంతో వెళ్తున్న యువకులు, అడ్డతీగల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నెల్లిపూడి గ్రామానికి చెందిన సబ్బవరపు సునీల్ (23) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన చెక్కా నానిబాబు (22)ను 108 అంబులెన్స్‌లో గోకవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరు యువకుల మృతితో నెల్లిపూడి కాలనీలో రెండు కుటుంబాలు శోకంలో మునిగిపోయాయి. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

సారా బట్టీలు ధ్వంసం

రంపచోడవరం: దేవీపట్నం మండలం ఇందుకూరుపేట, లోతుపాలెం గ్రామాల్లో గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించి రెండు నాటు సారా బట్టీలను ధ్వంసం చేశామని ఎస్‌ఈబీ సీఐ ఆనంద్ చెప్పారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 800 లీటర్ల పులుపును ధ్వంసం చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఫణీంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 9 మండలాల పరిధిలో 14 గ్రామ సచివాలయాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు విజయవంతమైనట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 11,408 గృహాల నుంచి వలంటీర్లు వివిధ ధృవపత్రాల నిమిత్తం యాప్‌లలో నమోదు చేశారని.12,542 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా, 4,886 ధ్రువపత్రాలను అందజేశామన్నారు. 22 దరఖాస్తులు తిరస్కరించగా, మిగిలిన పత్రాలను రెండు మూడు రోజుల్లో అందజేస్తామని చెప్పారు.

నేడు ప్రత్యేక శిబిరాలు

అడ్డతీగల మండలం దుచ్చర్తి, చింతపల్లి మండలంలోని చింతపల్లి-2, చౌడుపల్లి-2, దేవిపట్నం మండలంలోని శరభవరం, డుంబ్రిగుడ మండలంలోని కురిడి, సాగర, జి.కే.వీధి మండలంలోని దామనాపల్లి, వంచుల, జి.మాడుగుల మండలంలోని బీరం, సుర్మతి, గంగవరం మండలంలోని జగ్గంపాలెం, కొయ్యూరు మండలంలోని కొండగొకిరి, యూ.చీడిపాలెం, ముంచంగిపుట్టు మండలంలోని బాబుసాల, మాకవరం, రంపచోడవరం మండలంలోని ముసురుమిల్లి, రంపచోడవరం-3, వై.రామవరం మండలంలోని పనసలపాలెం గ్రామ సచివాలయాల్లో జరిగే జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష: ఐటీడీఏ పీవో అభిషేక్


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి,పాడేరు: ప్రజల సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుజేస్తుందని ఐటీడీఏ పీవో అభిషేక్ చెప్పారు. ఐనాడ సచివాలయం పరిధిలోని ఐనాడ గ్రామంలో జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఇక్కడ 217మంది లబ్ధిదారులకు పలు రకాల ధ్రువపత్రాలను ఐటీడీఏ పీవోతో పాటు ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబులు ఆయా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను గ్రామాల్లో ఇంటింటికే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లి అందజేస్తోందన్నారు. ప్రతి ధ్రువపత్రం చాలా విలువైనదని, తద్వారా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పొందవచ్చన్నారు.

ఐనాడలో సిగ్నల్స్ మెరుగవడం సంతోషకరం

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో తాను జగనన్న భూరక్ష పథకం సర్వేకు గ్రామానికి వచ్చానని, అప్పట్లో సెల్ సిగ్నల్స్ లేవన్నారు. గత నెలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో 100 సెల్ టవర్లను ప్రారంభించారని వాటిలో ఐనాడ పంచాయతీకి మేలు జరగడం సంతోషంగా ఉందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 578 మంది లబ్ధిదారులకు వారం రోజుల లోపే ధ్రువపత్రాలను తమ సిబ్బంది అందజేస్తున్నారన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నారని, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలోనే ధ్రువపత్రాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేల సేవలను గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ వి.త్రినాథనాయుడు, సర్పంచ్ బీమాలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గంగరాజు, మాజీ మండల అధ్యక్షుడు కూడా సింహచలం, అన్ని శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

శాంతించిన వరుణుడు

గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి


మత్స్యగుండం క్షేత్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ


చింతూరు మండలం తిమ్మిరిగూడెం వద్ద రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 10గంటల తరువాత వరుణుడు శాంతించాడు. బుధవారం ఉదయం నుంచి రాత్రంతా జిల్లాలోని అనేక ప్రాంతాలలో కుండపోతగా కురిసిన వర్షంతో అన్ని ప్రధాన గెడ్డలు,వాగులు ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి.పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో గెడ్డల ఉధృతితో రవాణా సంబంధాలు స్తంభించాయి.

– జి.మాడుగుల మండలం నుంచి ప్రవహించే మత్స్యగెడ్డ గురువారం ఉదయం నాటికి తగ్గుముఖం పట్టింది. పాడేరు మండలంలో బొక్కెళ్లు కాజ్‌వేకు కొంతభాగం గండి ఏర్పడటంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

– మత్స్యగుండం పుణ్యక్షేత్రం వద్ద మత్స్యగెడ్డలో వరద ప్రవాహం అధికంగా ఉంది. కిముడుపల్లి ప్రాంతంలోని గేదెగెడ్డ, పులిగొంది గెడ్డల వరదనీరు మత్స్యగెడ్డలో చేరుతోంది. భారీ వర్షాలతో జోలాపుట్టు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది.

ఎటపాకలో అత్యధిక వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం నాటికి 652.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎటపాకలో అత్యధికంగా 102.9 ఎంఎం వర్షపాతం నమోదైంది. మారేడుమిల్లిలో 93.2 ఎంఎం, కూనవరంలో 92.7ఎంఎం, చింతూరులో 84.1ఎంఎం, రంపచోడవరంలో 48.9ఎంఎం, రాజవొమ్మంగిలో 30.9, వి.ఆర్.పురంలో 27.6ఎంఎం, అడ్డతీగలలో 26ఎంఎం, వై.రామవరంలో 20.6ఎంఎం, గంగవరంలో 19.3ఎంఎం, దేవీపట్నంలో 17.8 ఎంఎం, ముంచంగిపుట్టులో 16.5 ఎంఎం, కొయ్యూరులో 16.4ఎంఎం, జీకేవీధిలో 15.8 ఎంఎం, చింతపల్లిలో 12.7ఎంఎం, హుకుంపేటలో 9 ఎంఎం, పెదబయలులో 8.6 ఎంఎం, జి.మాడుగుల 6.3 ఎంఎం, అనంతగిరి 1.8 ఎంఎం, అరకులోయలో 1.1ఎంఎం వర్షపాతం నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి.

నేటి నుంచి ఇంటింటికీ ఓటరు సర్వే

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బూత్ స్థాయిలో ఇంటింటా ఓటర్ల సర్వే చేపడుతున్నామని, జాయింట్ కలెక్టర్ జే.శివశ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించి, బూత్ స్థాయిలో ఏజంట్లను నియమించుకోవాలన్నారు. వచ్చే నెల 21వతేదీ వరకు బూత్‌ల స్థాయిలో ఓటర్ల జాబిత సర్వే జరుగుతుందన్నారు.ఫారం-6లో ఓటరు నమోదు, ఫారం-7లో ఓటరు తొలగింపు, ఫారం-8లో ఓటరు మార్పులు, చేర్పులు చేస్తారన్నారు. పంచాయతీల ద్వారా సేకరించిన వివిరాల్లోని మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. మండల స్థాయిలో బూత్ అధికారులు, బూత్‌ల ఏజంట్లకు సమావేశాలు నిర్వహించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. పీవీటీజీ ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, 18వేల మందిని ఓటర్లుగా నమోదు చేశారని, వాటిలో 13,225 ఓట్లు అనుమానితంగా ఉండడంతో వాటిని సమగ్రంగా విచారించి ఆయా ఓట్లను తొలగిస్తామని ఆయన చెప్పారు. పలు రాజకీయ పార్టీల నేతలు పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచాలని జేసీని కోరడంతో ప్రతిపాదనలు ఇస్తే అన్ని పార్టీల నేతలతో చర్చించి, ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపుతామని జేసీ హామీ ఇచ్చారు. డీఆర్వో అంబేద్కర్, అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ధవళేశ్వరం: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య చెప్పారు. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం నిర్వాసిత ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. విలీన మండలాల నిర్వాసితుల ప్రతినిధులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై స్పెషల్ కలెక్టర్ స్పందిస్తూ ప్రతి శుక్రవారం జరిగే అభివృద్ధి కమిటీ సమావేశాల్లో అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లాలని సూచించారు. మ్యుటేషన్ అయిన భూములకు సచివాలయంలో దరఖాస్తు చేసుకొని పట్టాదారు పాసు పుస్తకాలను పొందాలన్నారు. అర్హత ఉండి పునరావాసం, ప్యాకేజీ అందని నిర్వాసితులు తనను నేరుగా కలవచ్చునన్నారు. ప్రతి సోమవారం ధవళేశ్వరంలోని కార్యాలయంలో అందుబాటులో ఉంటానని చెప్పారు. కాంటూరు లెక్కలను మరోసారి రీ సర్వే చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. తాజా వరదల నేపథ్యంలో నిర్వాసితులకు భరోసా కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపునకు నోటిఫికేషన్ తేదీకి బదులుగా గ్రామాన్ని ఖాళీ చేసే తేదీని పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పునరావాస కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. 41వ కాంటూరు పరిధిలో ప్రభావిత గ్రామాలన్నింటికీ దశల వారీగా పునరావాసం, ప్యాకేజీ అందిస్తున్నట్టు ప్రవీణ్ వెల్లడించినట్లు నిర్వాసిత ప్రతినిధులు తెలిపారు. తాజాగా 2344 మందికి త్వరలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జమవుతాయని పేర్కొన్నారన్నారు. లైడార్ సర్వే ద్వారా మరో 36 గ్రామాలు చేరుస్తామన్నారన్నారు. పునరావాస కాలనీల సమస్యలను ఆయనకు వివరించామన్నారు.


మాట్లాడుతున్న పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


మీనామృతం తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధి ప్రసాద్

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంతో భూసారం దెబ్బతినకుండా ఉంటోందని, పంటల దిగుబడి బాగుంటుందని రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు, భీరం యూనిట్ ఇన్‌ఛార్జీలు ఎం ప్రసాద్, ఎస్.రామలింగం తెలిపారు. మండలంలో కోరాపల్లి, భీరం పంచాయతీల్లో పాలకొండ, అనర్భ గ్రామాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కషాయాలు తయారు చేసి పంటలకు పిచికారీ చేయటం వలన చీడ. పీడలు, పురుగులు నివారణ చేయవచ్చన్నారు. అలాగే అంతర పంటల సాగుతో ఆదాయం పొందవచ్చన్నారు. వరిలో శ్రీవరి, లైన్‌షోయింగ్, కాలిబాటలు, వేసుకోవటం వలన మొక్కలకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి బాగా తగిలి అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. సీడ్‌కిట్స్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. 5 కిలోల చేపల వ్యర్థాలు, 5కిలోల బెల్లం కలిపి, మరుగబెట్టి మీనామృతం తయారీ చేసి 100 నుంచి 150లీటర్లు నీటిని కలిపి పంటలపై పిచికారీ చేయడం వలన మొక్కల ఎదుగుదల, చీడపీడలు రాకుండా నివారించవచ్చన్నారు. ఐసీఆర్‌పీలు కోరాబు సురేష్, రమాదేవి, కె.విజయకుమారి, వీర్రాజు, రైతులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గిన తరువాత నారుమడులు

చింతూరు: వరద ప్రభావిత ప్రాంతాల రైతులు వరద తగ్గిన తరువాత నారుమడులు వేయాలని ఏవో శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో సూచించారు. నారుమడులు వేస్తే వరదలకు విత్తనాలు మొలకెత్తక కుళ్లిపోయే అవకాశముందన్నారు. మెరక ప్రాంతాల్లో నారుమడులు వేసిన రైతులు నారుమళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆకులు తెలుపు రంగులో మారితే ఇనుపధాతు లోపంగా గుర్తించాలన్నారు. నివారణకు ఫెర్రస్‌సల్ఫేట్ 10 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి, అందులో రెండు నిమ్మకాయల రసం పిండి పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

కుక్కర్ పేలి అంగన్‌వాడీ ఆయాకు గాయాలు


గాయపడిన ఆయా పార్వతమ్మ

సాక్షి, పాడేరు : చింతలవీధి పంచాయతీ ఉబ్బేడిపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో వంటగదిలో గ్యాస్ స్టౌపై పప్పు ఉడకబెడుతున్న కుక్కర్ గిన్నె ఒక్కసారిగా పేలిన సంఘటన ఆందోళన కలిగించింది. కుక్కర్ పేలి ఆయా రేగం పార్వతమ్మ కాలిపై పడడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. వరండాలో ఉన్న ఏడుగురు చిన్నారులకు, వారితో ఆటలు ఆడిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త కాసులమ్మకు త్రుటిలో అపాయం తప్పింది. కుక్కర్ పేలిన శబ్దానికి స్థానికులు అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నారు. గాయాలపాలైన ఆయా పార్వతమ్మను 108లో హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు కల్పించారు. కాలికి తీవ్ర గాయమవ్వడంతో శస్త్రచికిత్సకు వైద్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ఏడీఎంహెచ్‌వో


సీహెచ్‌సీలో అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో భాస్కర్

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి పనితీరుపై వచ్చిన వివిధ ఆరోపణలపై ఐటీడీఏ పీఓ సూరజ్ ఘనోరే ఆదేశాల మేరకు గురువారం రంపచోడవరం ఎడీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ విచారణ నిర్వహించారు. సీహెచసీని సందర్శించి, రికార్డులు, మందుల స్టాక్‌ను తనిఖీ చేశారు. ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఇన్‌పేషెంటు వార్డులోని రోగులకు మెరుగైన వైద్యసేవలు, భోజన సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. రోగులు, వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులు స్పందిస్తూ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని, తాము ఇతర మండలాల నుంచి ఈ ఇక్కడికి వస్తున్నామన్నారు. రోగులతో పాటు వెంట వచ్చిన తమ కుటుంబ సభ్యులకు భోజనాలు అందజేస్తున్నట్టు చెప్పారు. వైద్యాధికారులతో పాటు సిబ్బంది పనితీరు బాగుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చిన్న పిల్లల వార్డులో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్‌తో పాటు వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, విధుల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. సీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల ఏడీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ సంతృప్తి వ్యక్తం చేశారు. నివేదికను ఐటీడీఏ పీఓకు అందజేస్తామన్నారు. అనంతరం మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ పీహెచ్‌సీను సందర్శించి, అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య, చిన్న పిల్లల విబాగం వైద్యాధికారులు జీవన్, ఉమామధులత, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు-2023 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విస్ సీఈవో సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్, రాజకీయం, ఎన్జీవోలు, లాభాపేక్ష లేని సంస్థలు/సంఘాలు తాము అందిస్తున్న సేవలను వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓ పేజీలో పూర్తి వివరాలు వెల్లడించి.. ప్రెస్ క్లిప్పింగ్‌లు, ఫొటోలు జతచేసి, చిరునామా, ఫోన్ నంబర్, ఈ మెయిల్‌ను ఆగస్టు 12లోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట, విశాఖపట్నంలో సమర్పించాలి. మరిన్ని వివరాలకు 0891-2558291లో లేదా కార్యాలయం పని వేళల్లో నేరుగా సంప్రదించవచ్చు.